# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంపుటి : 3 సంచిక : 284 ఆదివారం 22 ఫిబ్రవరి 2026 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



News Portal Designing
Epaper Designing &
Web Hosting

Vn Media

+91 8099779988

vntelugudaily@gmail.com




# పైరవీలు పని చేయవు

- మెరిట్ ఉన్నవారికే పార్టీలో గుర్తింపు : సీఎం
- వికారాబాద్ జిల్లా అనంతగిరిలో డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమం
- శిక్షణా తరగతులను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి హాజరుకానున్న ఖర్గే, కేసీ వేణుగోపాల్

హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే సంస్కృతి, స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసిన వాళ్లం అవుతామని పార్టీ నాయకులను ఉద్దేశించి అన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మెజార్టీ 2 శాతమే తేడా అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్నెళ్ల తర్వాత జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ 4 శాతానికి పెరిగిందన్నారు. రెండేళ్ల తర్వాత జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ 12 శాతమని వివరించారు. కార్యకర్తల కృషి, ప్రజల నమ్మకం వల్లే కాంగ్రెస్ ఓటు శాతం పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ కుటుంబంలో 3 తరాలు దేశం కోసం ప్రాణాలు అర్పించారని, ఆయనకు సొంత ఇళ్లు కూడా లేదన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన రాహుల్ గాంధీ కుటుంబంపై ఇవాళ నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని ఐక్యంగా ఉంచే కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీని కనుమరుగు చేయాలని కుట్ర జరుగుతోందని రేవంత్ రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ పైరవీల కోసం తిరిగితే ప్రజల్లో, పార్టీలో చులకన అవుతారని రేవంత్ రెడ్డి సూచించారు. వాటిని వదిలేసి ప్రజల తరఫున పోరాడితే గౌరవం, మర్యాద తప్పక పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. సొంత అజెండా వదిలేసి ప్రజా అజెండా, పార్టీ అజెండా కోసం కృషి చేయాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. సమస్యలపై కొట్లాడితే స్వపక్షంతో పాటు విపక్షం కూడా గౌరవిస్తుందన్నారు. "నేను పీసీసీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉండేది. పార్టీలోనూ కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నాను. నేతలందరినీ కలిసి నా ఆలోచనలు - మిగతా3లో



# ఏళ్ల నిరీక్షణకు తెర!

- ఇకనుంచి గృహలక్ష్మి పథకానికి ఇందిరమ్మ భరోసా!
- గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఏళ్ల నిరీక్షణకు ముగింపు
- ప్రభుత్వాలు మారడంతో మధ్యలోనే నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు
- నిధులు లేక నిలిచిపోయిన ఇళ్లకు ఇందిరమ్మ పథకం కింద ఆర్థిక సాయం

హైదరాబాద్

గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఏళ్ల నిరీక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ముగింపు పలికింది. 2023లో సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ. 3లక్షలు సాయం అందించేలా అప్పటి బీఆర్?ఎస్? ప్రభుత్వం గృహలక్ష్మి పథకం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగానే ఏళ్ల క్రితం ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారడం వల్ల చేపట్టిన నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. - మిగతా3లో



## నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమే

- అక్రమ వలసదారులను ఓటరు జాబితా నుంచే కాదు దేశం నుంచి తొలగిస్తామన్న అమిత్ షా
- అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని రాహుల్ గాంధీ చెప్పాలన్న అమిత్ షా
- కానీ కాంగ్రెస్‌కు వారే ఓటు బ్యాంకు కాబట్టి పంపించలేరని విమర్శ

## ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026...

## న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు 88 దేశాల ఆమోదం

- ఏఐపై ప్రపంచ ఏకాభిప్రాయం
- సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' స్ఫూర్తితో డిక్లరేషన్ రూపకల్పన
- ఏడు కీలక స్తంభాల ఆధారంగా ఏఐపై అంతర్జాతీయ సహకారానికి పిలుపు
- ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఉపయోగించాలని తీర్మానం





## భారత్-బ్రెజిల్ కలిస్తే గ్లోబల్ సౌత్ మరింత బలోపేతం

- భారత్ పర్యటనలో బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ద సిల్వా
- రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం
- గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో పాల్గొన్న లూలాకు మోదీ కృతజ్ఞతలు

## ఇకపై పొడిగా, రుచికరంగా భోజనం

- త్వరలోనే ప్రభుత్వ పాఠశాలల్లో స్టీమ్ రైస్ పంపిణీ
- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో ముద్దముద్దగా మారుతున్న బియ్యం
- సమస్యను రూపుమాపేందుకు స్టీమ్ రైస్‌ను సరఫరా చేయనున్న పౌర సరఫరాల శాఖ
- మార్చి 1 నుంచి అమలు చేసేందుకు నిర్ణయించిన ప్రభుత్వం



హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం ద్వారా అనేక మంది విద్యార్థులు లంచ్ బాక్స్ సమస్య నుంచి దూరం అయ్యారు. స్కూల్‌లోని విద్యార్థులకు చదువుతో పాటు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. సాధారణంగా పిల్లలు మధ్యాహ్న భోజనం అంటే ఇష్టంగా తింటారు. అయితే వండిన ఆహారం రుచి లేకున్నా, వారికి నచ్చకున్నా అన్నాన్ని పారవేస్తారు లేదా తినడమే మానేస్తారు. దీంతో వారి ఆరోగ్యంపై అది ప్రభావం చూపుతుంది. ఇదే తరహాలో రాష్ట్రంలో పలు పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనంలో వినియోగించే అన్నం ముద్దగా మారడంతో విద్యార్థులు తినేందుకు ఇష్టపడటం లేదు. ఈ సమస్యపై దృష్ట పెట్టిన రాష్ట్ర - మిగతా3లో

# ఇక అక్రమాలకు చెక్

- ధరణి పోర్టల్‌లో కోడ్ ఆడిటింగ్
- ధరణి పోర్టల్‌లో అక్రమాలకు చెక్ పెట్టేలా ప్రభుత్వం చర్యలు
- జనగామ, యాదాద్రి జిల్లాల్లో స్టాంపు డ్యూటీ, చలాన్ల డబ్బు దారి మళ్లింపు ఘటనలతో అప్రమత్తం
- మళ్లీ జరగకుండా కోడ్ ఆడిటింగ్‌కు నిర్ణయం
- విచారణకు ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ




హైదరాబాద్

ధరణి పోర్టల్‌లో అక్రమాలకు చెక్ పెట్టేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా కోడ్ ఆడిటింగ్ చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీ-డాక్‌కి బాధ్యతలు అప్పగించింది. ధరణి పోర్టల్‌లో లోతైన ఆడిటింగ్ వ్యవస్థ తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. కోడ్ ఆడిటింగ్ ఏర్పాటు చేసేందుకు సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్-సి-డాక్‌కు బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ - టీజీఎస్ఎస్ నేతృత్వంలో సి-డాక్ కోడ్ ఆడిటింగ్‌ను చేపట్టనున్నారు. భూ భారతి పోర్టల్లో ఇటీవల యాదాద్రి-భువనగిరి, జనగామ జిల్లాల కేంద్రంగా స్టాంపు డ్యూటీ, చలాన్ల నగదును కొందరు దారి మళ్లించిన విషయయం తెలిసిందే. ఆ విషయంపై విచారణకు ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ మరిన్ని లోతైన విషయాలు గుర్తించింది. ధరణి పోర్టల్ ఏర్పాటు నాటి నుంచి కొన్ని రక్షణపరమైన లోపాలు లేవంటూ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి ఆ కమిటీ తీసుకొచ్చింది. దీంతో పోర్టల్‌ను మరింత పకడ్బందీగా తయారు - మిగతా3లో

## నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమే

నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమేనని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. అసోంలోని కామ్‌రూప్‌లో పోలీస్ శాఖ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ వలసదారులను కేవలం ఓటరు జాబితా నుంచి మాత్రమే కాదని, దేశం నుంచి కూడా తొలగిస్తామని అన్నారు. చొరబాటుదారులు ఆక్రమించిన స్థలాల నుంచి వారిని తరిమికొడితే మరోచోట నివాసం ఏర్పరుచుకునే అవకాశం ఉందని, కాబట్టి వారిని దేశం నుంచే పంపించివేయాలని అన్నారు. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. వారు చెప్పిన మాటలు విశ్వసించవద్దని, ఎందుకంటే వారికి చొరబాటుదారులే ఓటు బ్యాంకు కాబట్టి వారిని పంపించలేరని అన్నారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు అసోంకు ముప్పుగా పరిణమించాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి వస్తే కాంగ్రెస్ కట్టుబడి ఉంటే పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని డిమాండ్ చేశారు. వచ్చే ఐదేళ్ల కాలంలో అసోంను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

## ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026... న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు 88 దేశాల ఆమోదం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అంతర్జాతీయ సహకారానికి సంబంధించి భారత్ కీలక ముందడుగు వేసింది. న్యూఢిల్లీ వేదికగా జరిగిన మెగా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్'ను ఆమోదించారు. భారత్‌తో సహా 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు దీనికి మద్దతు తెలపడం ప్రపంచ ఏకాభిప్రాయానికి నిదర్శనంగా నిలిచింది. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై ఈ డిక్లరేషన్ ఒక స్పష్టమైన మార్గాన్ని నిర్దేశిస్తోంది. 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' (అందరి సంక్షేమం, అందరి ఆనందం) అనే భారతీయ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఏఐ ద్వారా లభించే ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆశయాన్ని ఇది పునరుద్ఘాటించింది. "వసుధైవ కుటుంబకం" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భావనతో, అన్ని దేశాలు తమ పౌరుల ప్రయోజనాల కోసం ఏఐని అభివృద్ధి చేసి, వినియోగించుకునేలా వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రాముఖ్యతను ఈ తీర్మానం నొక్కి చెప్పింది. అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, అన్ని భాగస్వామ్య పక్షాలను కలుపుకొని పోవడం, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, విశ్వసనీయమైన ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా ఏఐ పురోగతిని ప్రోత్సహించడం వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యత ఇచ్చారు.
ఈ డిక్లరేషన్ ఏడు కీలక స్తంభాల ఆధారంగా రూపొందింది.

1. ఏఐ వనరుల ప్రజాస్వామ్యీకరణ
2. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు
3. సురక్షితమైన, విశ్వసనీయమైన ఏఐ
4. శాస్త్రీయ ప్రగతికి ఏఐ
5. సామాజిక సాధికారతకు ఏఐ లభ్యత
6. మానవ వనరుల అభివృద్ధి
7. స్థిరమైన, సమర్థవంతమైన, వినూత్నమైన ఏఐ వ్యవస్థలు

"ఏఐని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే పటిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, అందరికీ అందుబాటులో ఉండే అర్థవంతమైన కనెక్టివిటీ అత్యంత అవసరం" అని ఈ డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఓపెన్ సోర్స్, ఇంధన సామర్థ్యం గల ఏఐ మౌలిక సదుపాయాల అవసరాన్ని కూడా ఇది హైలైట్ చేసింది. 'చార్టర్ ఫర్ ది డెమొక్రాటిక్ డిఫ్యూజన్ ఆఫ్ ఏఐ' అనే స్వచ్ఛంద, నిర్బంధం లేని ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇది జాతీయ చట్టాలను గౌరవిస్తూనే, ఏఐ వనరులను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, స్థానిక ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది. శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధి, పాలన, ప్రభుత్వ సేవల వంటి రంగాల్లో ఏఐ పాత్రను విస్తరించాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. సురక్షితమైన, నమ్మకమైన ఏఐ వ్యవస్థలను నిర్మించడం ద్వారానే ప్రజల్లో విశ్వాసం పెరిగి, దాని పూర్తి ప్రయోజనాలను పొందగలమని పేర్కొంది. ఈ సమ్మిట్ ద్వారా ఏర్పడిన ఏకాభిప్రాయం, భవిష్యత్తులో ఏఐని మానవాళి ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవడానికి అవసరమైన అంతర్జాతీయ సహకారానికి మార్గం సుగమం చేస్తుందని సభ్య దేశాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## యువతులతో భారతీయుల క్లబ్బులు, బార్లపై దాడులు... జైషే అంతర్జాతీయ కుట్ర!

**భారతీయులే లక్ష్యంగా జైషే మహమ్మద్ భారీ కుట్ర**

**పబ్‌లు, క్లబ్బుల్లో దాడులకు యువతులను నియమించుకుంటున్న ఉగ్రసంస్థ**

**పాక్ ప్రమేయం బయటపడకుండా విదేశీ మహిళల నియామకం**

**గాజా సహాయం పేరుతో దాడులకు భారీగా నిధుల సేకరణ**

**ప్రపంచవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు జరపాలని ప్లాన్**



పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జీవవీ) ఉగ్రవాద సంస్థ భారతీయులే లక్ష్యంగా ఒక భారీ అంతర్జాతీయ కుట్రకు తెరలేపింది. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు యాజమానులుగా ఉన్న నైట్‌క్లబ్బులు, పబ్‌లు, బార్లలో దాడులు చేసేందుకు యువతులను నియమించుకుంటోంది. ఈ సంచలన విషయాన్ని భారత నిఘా వర్గాలు పసిగట్టాయి. జైషే తన మహిళా విభాగాన్ని ఈ ఆపరేషన్ కోసం ప్రత్యేకంగా రంగంలోకి దించింది. అందంగా ఉన్న యువతులను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇస్తున్నారు. అనంతరం వీరిని ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు నిర్వహిస్తున్న క్లబ్బులలో ఉద్యోగాల్లో చేర్పిస్తారు. అక్కడ పనిచేస్తూ, ఆ ప్రదేశంపై పూర్తి సమాచారం (రెక్కీ) సేకరించడం వీరి ప్రాథమిక విధి అని ఓ అధికారి తెలిపారు. రెక్కీ పూర్తయిన తర్వాత, అదే మహిళలతో దాడులు చేయించాలని జైషే ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం అమెరికా, యూకే, థాయ్‌లాండ్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, దుబాయ్ వంటి దేశాల్లోని లక్ష్యాలను గుర్తిస్తున్నట్లు సమాచారం. ఈ కుట్రలో పాకిస్థాన్ ప్రమేయం బయటపడకుండా ఉండేందుకు, పాకిస్థానీ మహిళలను తక్కువ సంఖ్యలో వాడుకుని, ఉజ్బెకిస్థాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి ఎక్కువ మందిని రిక్రూట్ చేసుకుంటున్నారు. ఐఎస్ఐ సహకారంతో వీరికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఉద్యోగాల్లో చేర్పిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన అన్ని ప్రదేశాల్లో ఏకకాలంలో దాడులు జరిపి సంచలనం సృష్టించాలని జైషే భావిస్తోంది. ఈ భారీ ఆపరేషన్ కోసం పెద్ద ఎత్తున నిధులు అవసరం కావడంతో, 'గాజా సహాయం' పేరుతో పాకిస్థాన్, గల్ఫ్ దేశాల్లో గత నాలుగు నెలలుగా విరాళాలు సేకరిస్తోంది. వ్యక్తిగత నష్టాలు, వేధింపులకు గురైన చరిత్ర ఉన్న మహిళలనే జైషే ఎక్కువగా లక్ష్యం చేసుకుంటోంది. ఇలాంటి వారు సులభంగా ఆత్మాహుతి దళ సభ్యులుగా మారతారని, వారిపై అనుమానం కూడా రాదని ఉగ్రవాద నిరోధక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ అంతర్జాతీయ కుట్రపై భారత ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి.

# భారత్-బ్రెజిల్ కలిస్తే గ్లోబల్ సౌత్ మరింత బలోపేతం

లఅంతర్జాతీయ వేదికపై భారత్, బ్రెజిల్ దేశాలు కలిసి పనిచేస్తే 'గ్లోబల్ సౌత్' స్వరం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత్, బ్రెజిల్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రానున్న రోజుల్లో భారీగా పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ఈ వాణిజ్యాన్ని ఏకంగా 20 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. భారత పర్యటనలో ఉన్న బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా ద సిల్వాతో ప్రధాని మోదీ శనివారం దిల్లీ సమావేశమయ్యారు. ఇరువురి నేతల మధ్య కీలక ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. భవిష్యత్ కోసం డిజిటల్ పార్ట్‌నర్‌షిప్, రేర్‌ఎర్త్ అండ్ క్రిటికల్ మినరల్స్, స్టీల్ సరఫరా గొలుసులో మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారానికి సంబంధించి మూడు ఒప్పందాలపై వారిద్దరు సంతకాలు చేశారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్త విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లులా ద సిల్వా రాక పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. "అధ్యక్షుడు లులాకు, ఆయనతో వచ్చిన ప్రతినిధుల బృందానికి స్వాగతం పలకడం చాలా ఆనందంగా ఉంది" అని మోదీ అన్నారు. లులా దార్శనికత, నాయకత్వంలో ఇరు దేశాల సంబంధాలు ఎంతో బలపడ్డాయని కొనియాడారు. గత కొన్నేళ్లలో లులాను తాను పలుమార్లు కలిశానని మోదీ గుర్తు చేసుకున్నారు. ప్రతి కలయికలోనూ భారత్‌పై ఆయనకు ఉన్న నమ్మకం, గొప్ప స్నేహభావం తనకు కనిపించాయన్నారు. ప్రస్తుతం భారత్‌లో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న 'గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో లులా పాల్గొన్నారు. దీనిపై ప్రధాని మోదీ ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. లులా పర్యటన ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త శక్తిని ఇచ్చిందని మోదీ



వ్యాఖ్యానించారు.

**టెక్నాలజీ అనుసంధానం**

లాటిన్ అమెరికా దేశాల్లో భారత్‌కు బ్రెజిల్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ఈ విషయాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాబోయే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 20 బిలియన్ డాలర్లకు పెంచాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ఈ వాణిజ్యం కేవలం ఒక అంకె మాత్రమే కాదని ఆయన అన్నారు. ఇది రెండు దేశాల మధ్య ఉన్న నమ్మకానికి, మైత్రికి ప్రతీక అని అభివర్ణించారు. బ్రెజిల్‌లో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ఏర్పాటు చేయనున్నారు. దీనిపై భారత్ ఎంతో ఉత్సాహంగా, చురుగ్గా పనిచేస్తోందని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. దీనితో పాటు మరికొన్ని కీలక ఆధునిక రంగాలపై ఇరు దేశాలు దృష్టి పెట్టాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సూపర్ కంప్యూటర్లు, సెమీకండక్టర్లు, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీల్లో సహకారాన్ని మరింతగా పెంచుకోనున్నారు. సాంకేతికత అందరికీ అందుబాటులో ఉండాలని ఇరు దేశాలు బలంగా నమ్ముతున్నాయి. ఆ సాంకేతికత ఉమ్మడి ప్రగతికి వారధిలా మారాలని నేతలు ఆకాంక్షించారు.

**అత్యున్నత శక్తుల కలయిక**

సంయుక్త ప్రెస్‌మీట్‌లో బ్రెజిల్ అధ్యక్షుడు లులా ద సిల్వా మాట్లాడుతూ, "నా ప్రియ మిత్రుడు మోదీని మళ్లీ కలవడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ గొప్ప దేశానికి రావడం నాకు ఇది ఆరోసారి. ఇక్కడ నాకు దక్కిన గౌరవానికి అమితంగా సంతోషిస్తున్నాను. భారత్, బ్రెజిల్ దేశాల భేటీ సాధారణమైనది కాదు. ఇదొక అత్యున్నత శక్తుల కలయిక. మనం గ్లోబల్ సౌత్‌లో కేవలం రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు మాత్రమే కాదు. ఒకటి 'డిజిటల్ సూపర్ పవర్' (భారత్), ఇంకోటి 'పునరుత్పాదక ఇంధన సూపర్ పవర్' (బ్రెజిల్). మన రెండు దేశాలు అపారమైన జీవ, సాంస్కృతిక వైవిధ్యానికి కేంద్రాలు. ప్రపంచ శాంతిని, బహుపాక్షిక విధానాలను రెండు దేశాలు బలంగా విశ్వసిస్తాయి" అని లులా పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న సమన్వయం, పరస్పర విశ్వాసానికి ఈ పర్యటనలు అద్దం పడుతున్నాయని ఆయన అన్నారు. మారుతున్న భౌగోళిక రాజకీయాల నేపథ్యంలో భారత్, బ్రెజిల్ పాత్ర చాలా కీలకమని లులా స్పష్టం చేశారు. "ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అస్థిరమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి సమయంలో రెండు దేశాలు వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకోవాలి. ఐక్యరాజ్యసమితి, డబ్ల్యూటీవో, జీ20 వంటి అంతర్జాతీయ వేదికలపై భారత్, బ్రెజిల్ గొంతుకలు ఎంతో కీలకం. అంతర్జాతీయ చట్టాలకు లోబడి, మరింత న్యాయబద్ధమైన, శాంతియుతమైన బహుపాక్షిక ప్రపంచాన్ని నిర్మించడంలో మనమే ప్రధాన భాగస్వాములం" అని ఆయన ఉద్ఘాటించారు.

# ఇండియన్ ఎప్‌స్టీన్ ఫైల్

జెఫ్రీ ఎప్‌స్టీన్ తరహా లైంగిక వేధింపుల వ్యవహారం ఒకటి తాజాగా భారత్‌లోనూ వెలుగు చూసింది. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మాజీ జూనియర్ ఇంజినీర్ రాం భావన్ (50), అతడి భార్య దుర్గావతి (47) కలిసి దాదాపు 33 మంది బాలబాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వెల్లడైంది. 3 నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలను లైంగికంగా వేధించే 2 లక్షల వీడియోలను తీసి, వాటికి రేటు కట్టి డార్క్ వెబ్‌లో 47 దేశాల వాళ్లకు అమ్మేశారని దర్యాప్తులో గుర్తించారు. దాదాపు 12 ఏళ్ల పాటు ఈ దందాను రాం భావన్, దుర్గావతి దంపతులు నడిపారని విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో ఉత్తర్?ప్రదేశ్‌లోని బాండా పట్టణంలో ఉన్న ప్రత్యేక పోక్సో కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. న్యాయస్థానం వారిద్దరికి మరణశిక్షను విధించింది.

**ఇలాంటి వాళ్లను జైల్లో పెట్టినా మారరు : కోర్టు**

ఇది దారుణమైన దుర్మార్గాలతో ముడిపడిన అత్యంత అరుదైన కేసు అని ఈ సందర్భంగా ప్రత్యేక పోక్సో కోర్టు వ్యాఖ్యానించింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని చాలా జిల్లాల్లో రాం భావన్ దంపతుల బాధితులు ఉన్నారని తెలిపింది. ఈ భార్యాభర్తలు నైతిక విలువలను మర్చిపోయి చిన్నారి బాలికలతో అత్యంత అరాచకంగా ప్రవర్తించారని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి అసాధారణమైన, హేయమైన నేరాలకు పాల్పడే వాళ్లను జైలులో పెట్టి మార్పు తేవడం కూడా కష్టమేనని బాండా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి కామెంట్ చేశారు. అందుకే బాధితులకు న్యాయం చేసేందుకు, రాం భావన్ దంపతులకు మరణశిక్షను విధించామని ఆయన చెప్పారు. బాధిత బాలబాలికలు అందరికీ రూ.10 లక్షలు చొప్పున పరిహారాన్ని చెల్లించాలని ఉత్తర్?ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. రాం భావన్ దంపతుల ఇంట్లో నుంచి సీజ్ చేసిన రూ.8 లక్షలను కూడా బాధిత బాలలకు సరిసమానంగా పంచాలని నిర్దేశించింది.

**రాం భావన్, దుర్గావతి పాపాల చిట్టా**

రాం భావన్, దుర్గావతి దంపతులు 2010లో సెక్స్ రాకెట్‌ను మొదలుపెట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని చిత్రకూట్ జిల్లా కేంద్రంలో ఒక గదిని అద్దెకు తీసుకొని, అందులోనే ఈ వ్యవహారాలన్నీ చేసేవారు. మొబైల్ ఫోన్లు, చాక్‌లెట్లు, వాచ్‌లు, ఆన్‌లైన్



వీడియో గేమ్స్, డబ్బులను ఎరగా వేసి 3 నుంచి 18 ఏళ్లలోపు బాల,బాలికలను ఆకర్షించేవారు.
అనంతరం బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడేవారు. ఈ వ్యవహారాల వీడియోలు, ఫొటోలను తీసేవారు.
2010 నుంచి 2020 వరకు ఈ దందాను రాం భావన్, దుర్గావతి దంపతులు నిరాటంకంగా కొనసాగించారు.
ఈ వ్యవధిలో బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడే 2 లక్షలకుపైగా వీడియోలను షూట్ చేశారు. వాటిని 47 దేశాలకు చెందిన కస్టమర్లకు డార్క్ వెబ్ ద్వారా విక్రయించి డబ్బులు సంపాదించారు.
తొలిసారిగా 2020 అక్టోబరులో ఈ సెక్స్ రాకెట్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.
2020 అక్టోబరు 31న రాం భావన్ దంపతులపై సీబీఐ కేసును నమోదు చేసింది.
దర్యాప్తు ముగిశాక, 2021 ఫిబ్రవరి 10న సీబీఐ ఛార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేసింది.
ఈ సెక్స్ రాకెట్ బాధితుల జాబితాలో ఉన్న బాలబాలికల ప్రైవేటు భాగాలకు తీవ్ర గాయాలైనట్లు గుర్తించామని దర్యాప్తు నివేదికలో సీబీఐ ప్రస్తావించింది.
తీవ్ర లైంగిక వేధింపుల వల్ల కొందరు బాలలకు మెల్ల కన్ను సమస్య వచ్చిందని సీబీఐ గుర్తించింది.
రాం భావన్ దంపతులు చేసిన ఘోరాలను మర్చిపోలేక ఇప్పటికీ చాలామంది బాధిత బాలలు మానసిక సమస్యలతో సతమతం అవుతున్నారని సీబీఐ పేర్కొంది.
2023 మే 26న రాం భావన్ దంపతులపై ప్రత్యేక పోక్సో కోర్టు అభియోగాలను నమోదు చేసింది.
ఈ కేసులో రాం భావన్ దంపతులు దోషులు అని ప్రత్యేక పోక్సో కోర్టు 2026 ఫిబ్రవరి 18న నిర్ధరించింది.
ఆ ఇద్దరు కీచక భార్యాభర్తలకు మరణశిక్షను విధిస్తూ ఫిబ్రవరి 20న కోర్టు తీర్పును వెలువరించింది.

# ట్రంప్‌నకు షాకిచ్చేలా అమెరికా సుప్రీంకోర్టు తీర్పు

ప్రపంచ దేశాలపై సుంకాల బాదుడు వ్యవహారంలో ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్‌నకు షాకిచ్చేలా అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పుపై భారత వాణిజ్యశాఖ స్పందించింది. శుక్రవారం రోజు అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వివరాలను తాము పరిశీలించామని వెల్లడించింది. దీనిపై ప్రెసిడెంట్ ట్రంప్ కూడా ఒక మీడియా సమావేశంలో మాట్లాడారని తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా కొన్ని చర్యలను చేపడతామని అమెరికా ప్రభుత్వం కూడా ప్రకటించిందని భారత వాణిజ్యశాఖ పేర్కొంది. ఈ అన్ని పరిణామాలను, వాటితో ఏర్పడబోయే పర్యవసానాలను నిశితంగా అధ్యయనం చేస్తున్నామని చెప్పింది. ఈమేరకు భారత వాణిజ్యశాఖ శనివారం ఓ ప్రకటనను విడుదల చేసింది. అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై శనివారం ఉదయం కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ తీర్పును కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేస్తుందని ఆయన చెప్పారు. దీనిపై అధికారికంగా స్పందించాల్సింది తాను కాదని, కేంద్ర వాణిజ్య శాఖ లేదా విదేశాంగ శాఖ స్పందిస్తాయన్నారు. అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వివరాలను తాను పత్రికల్లో చదివానని ప్రహ్లాద్ జోషి తెలిపారు. ప్రపంచ దేశాలపై ఏకపక్షంగా సుంకాలను విధించే రాజ్యాంగ అధికారం దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు లేదని అమెరికా సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం రోజు (ఫిబ్రవరి 20న) స్పష్టం చేసింది. దేశ రాజ్యాంగం కేటాయించిన అధికారాల పరిధికి మించి ట్రంప్ నిర్ణయాలను తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్ (ఐఈఈపీఏ)- 1977 ఇచ్చిన అధికారంతోనే అకస్మాత్తుగా దిగుమతి సుంకాలను పెంచాననే ట్రంప్ వాదనను కోర్టు తోసిపుచ్చింది. 1977 చట్టం వల్ల అమెరికా అధ్యక్షుడికి అలాంటి అధికారాలేం లభించవని తెలిపింది. ప్రపంచ దేశాలపై విధించే దిగుమతి సుంకాలను ట్రంప్ ఎడాపెడా పెంచడం చట్టవ్యతిరేకమని సుప్రీంకోర్టు బెంచ్ తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టు ధర్మాసనంలో మొత్తం 9 మంది న్యాయమూర్తులు ఉండగా, ఆరుగురు న్యాయమూర్తులు ట్రంప్ నిర్ణయాలు చట్ట వ్యతిరేకమైనవి అని తెలిపారు. మిగతా ముగ్గురు న్యాయమూర్తులు మాత్రం ఈ అభిప్రాయంతో విభేదించారు. దీంతో మెజారిటీ న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పే అమల్లోకి వచ్చింది. ఈ తీర్పు ఇచ్చిన అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తులలో ఇద్దరిని స్వయంగా ప్రెసిడెంట్ ట్రంపే నామినేట్ చేశారు. అయినా వారు ట్రంప్‌తో ముడిపడిన ఈ కేసులో అత్యంత స్వతంత్రంగా తీర్పును వెలువరించారు. సుప్రీంకోర్టు తీర్పుపై ట్రంప్ మండిపడ్డారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా, విదేశీ ప్రయోజనాల ప్రభావం వల్లే సుప్రీంకోర్టు ఇలాంటి తీర్పును ఇచ్చిందని ఆయన ఆరోపించారు. ఈవిధమైన తీర్పును ఇచ్చిన జడ్జీలను చూడటానికి సిగ్గుగా ఉందన్నారు. అమెరికాకు ఏది మంచిదో అది చేసే ధైర్యం వాళ్లకు లేదన్నారు. అమెరికాను కాపాడుకు నేందుకు గతంలో నేను విధించిన దాని కంటే ఎక్కువ సుంకాలను విధించే అధికారం దేశ అధ్యక్షుడికి ఉందని ట్రంప్ కామెంట్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వల్ల తాను మరింత శక్తివంతుడిగా మారానని ఆయన చెప్పుకొచ్చారు. ఈ అంశంపై అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2026లో అమెరికాకు రావాల్సిన సుంకాల ఆదాయం ఏమాత్రం తగ్గకుండా చూడటానికి ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నామని ఆయన వెల్లడించారు. వైట్ హౌస్ అధికార వర్గాలు సైతం ఇదే విధమైన వ్యాఖ్యలు చేశాయి. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన కొన్ని గంటల తర్వాత ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను ట్రంప్ జారీ చేశారు. ఇకపై ప్రపంచ దేశాలపై 10 శాతం సుంకాన్నే విధిస్తామని దానిలో ప్రస్తావించారు. ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ఫిబ్రవరి 24 నుంచి 150 రోజుల పాటు అమల్లో ఉంటుందని సమాచారం. ఇప్పటికే అమెరికాతో ఖరారైన ట్రేడ్ డీల్‌లో 18 శాతం దిగుమతి సుంకాన్ని చెల్లించేందుకు భారత్ ఓకే చెప్పింది. అయితే సుంకాలను 10 శాతానికి తగ్గించే ట్రంప్ కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ భారత్‌కూ వర్తిస్తుందని వైట్ హౌస్ వెల్లడించింది. అమెరికా ఆర్థిక శాఖ, వైట్ హౌస్ అధికార వర్గాలు మాత్రం ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నామని చెబుతున్నాయి.

# ఏళ్ల నిరీక్షణకు తెర!

-మొదటిపేజీ తరువాయి

ఆ ఇళ్లకు ఇందిరమ్మ పథకాన్ని వర్తింపజేస్తూ ఆర్థిక సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అసలు విషయమేంటంటే : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ గృహలక్ష్మి పథకానికి దాదాపు 1,69,053 దరఖాస్తులు స్వీకరించారు. భద్రాద్రిలో 86,773, ఖమ్మంలో 82,280 ఆర్జీలు దాఖలయ్యాయి. గత మూడేళ్ల క్రితం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ నియోజకవర్గానికి మూడు వేల ఇళ్లను కేటాయించారు. వీటిని అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి సుమారు 50 వేలకు పైగా మందిని ప్రాథమికంగా అర్హులని నిర్ధారించారు. అంతేకాదు కొందరు లబ్ధిదారులకు అప్పుడున్న మంత్రులు, ఎమ్మెల్యే మంజూరు పత్రాలు కూడా అందించారు. ఇందిరమ్మ పథకంతో లబ్ధిదారులకు భరోసా : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పత్రాల మంజూరు తర్వాత సుమారు 2 వేలకు పైగా అర్హులు ఇంటి నిర్మాణాలను ప్రారంభించుకున్నారు. ఆ తర్వాత అనంతరం ఎన్నికల కోడ్? రావడం, ప్రభుత్వం మారటం, కాంగ్రెస్? పార్టీ ఎన్నికల్లో హామీలు మేరకు ఇందిరమ్మ ఇళ్లకు పథకానికి శ్రీకారం చుట్టడంతో గృహలక్ష్మి లబ్ధిదారుల పరిస్థితి దారుణంగా తయారైంది. దీంతో అప్పుడు నిర్మాణం చేపట్టి మధ్యలోనే నిలిపివేసి, ఆ తర్వాత మళ్లీ ఇందిరమ్మ పథకంలో లబ్ధి పొందక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్? ప్రభుత్వ తాజాగా ఈ నిర్ణయంతో తీసుకోవడంతో లబ్ధిదారులు భరోసా దక్కనుంది.

**చేకూరే ప్రయోజనాలు ఇవే**

గృహలక్ష్మి పథకం కింద నిధులు లేక నిలిచిపోయిన ఇళ్లకు ఆర్థిక సాయం అందుతుంది. దీని ఫలితంగా ఎన్నో ఏళ్ల తరబడి వర్షంలో తడుస్తూ పాడవుతున్న పిల్లర్లు, పునాదులు ఇప్పటికే నివాసయోగ్యమైన గృహాలుగా మారనున్నాయి.

**షరతులు వర్తిస్తాయి :**

నిలిచిపోయిన గృహలక్ష్మి నిర్మాణాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో అన్ని కోణాల్లో పరిశీలించి ఆ తర్వాత ఇందిరమ్మ పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

ప్రస్తుత ఇందిరమ్మ ఇళ్ల మార్గదర్శకాల ప్రకారం ఇంటి పునాది ప్రాంతం 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల మధ్య ఉండాలని నిర్ణయించింది. గృహలక్ష్మి లబ్ధిదారుల బేస్?మెంట్? తక్కువ ఉంటే దానిని 400 చ.అడుగులకు తేవటానికి మరింత పునాది బీమ్?లను వేయాలి. అదే పెద్ద బేస్?మెంట్? విషయంలో పునాది ప్రాంతం గరిష్ఠంగా దాన్ని 600 చదరపు అడుగులకు పరిమితం చేయాలి. ఇదివరకే ఆ నిర్మాణాన్ని బేస్?మెంట్? తీసుకెళ్లిన దృష్ట్యా వారికి ఆ దశ డబ్బులు చెల్లించరు. మిగిలిన రూ.4 లక్షలు దశల వారీగా ఖాతాలో జమ చేస్తారు. పై కప్పు? లెవల్? వరకు అయితే రూ. లక్ష, స్లాబ్? పూర్తయితే రూ. 2 లక్షలు, మొత్త నిర్మాణం పూర్తయిన తర్వాత మరో రూ. లక్ష చెల్లించనున్నారు. ఆ తర్వాత ఉపాధి హామీ కింద రోజుకు రూ. 307 మొత్తం 90 రోజులకు రూ. 27,630 జమ చేస్తారు. అదే విధంగా స్వచ్ఛభారత్? మిషన్? కింద మరుగుదొడ్లు నిర్మించుకుంటే రూ. 12,000, ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్? యోజన తరఫున మరో రూ.21 వేలు చొప్పున మొత్తం రూ. 60 వేలను లబ్ధిదారుల అకౌంట్లో నేరుగా జమ చేయనున్నారు.

# పరిషత్‌లు రద్దు దిశగా అడుగులు




**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల పరిపాలనా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ఎంపీటీసీ, జడ్‌పీటీసీ వ్యవస్థలను పూర్తిగా రద్దు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఒక వేళ ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, తెలంగాణ రాజకీయాల్లో ఇది ఒక పెను సంచలనంగా మారొచ్చు. తెలంగాణలో ప్రస్తుతం అమల్లో ఉన్న మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పాత్రపై ప్రభుత్వం సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించింది. ఈ వ్యవస్థ రద్దు చేయాలనే ఆలోచన వెనుక మూడు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. ఈ వ్యవస్థ ద్వారా ప్రజల చేత ఎన్నికైన ప్రతినిధులకు క్షేత్రస్థాయిలో సరైన అధికారులు కానీ, నిర్దిష్టమైన బాధ్యతలు కానీ లేవని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. కేవలం పదవులు ఉండి, నిధులు, విధులు లేకపోవడం వల్ల ఆశించిన అభివృద్ధి జరగడం లేదని సర్కారు భావిస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయడం ద్వారా భవిష్యత్‌లో ఈ స్థానాలకు ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరమే ఉండదని ప్రభుత్వం యోచిస్తోంది. ఇది ప్రభుత్వ ఖజానాపై భారాన్ని తగ్గించమే కాకుండా తరచూ వచ్చే ఎన్నికల కోడ్ అడ్డంకులను కూడా నివారిస్తుందని అంటున్నారు. ప్రస్తుతం వ్యవస్థల వల్ల పాలనాపరంగా పెద్దగా ఉపయోగం లేదని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనపై స్పష్టత రావడానికి ఫిబ్రవరి 23న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశం అత్యంత కీలకమైంది. ఈ సమావేంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థల రద్దుపై ప్రభుత్వం చర్చించే ఛాన్స్ ఉంది. ఈ లోగా ఈ అంశంపై ఒక సమగ్ర నివేదికను సమర్పించాలని రేవంత్ ప్రభుత్వం పంచాయతీ రాజ్‌శాఖను ఆదేశించింది. ఈ నివేదికలో ఈ వ్యవస్థల వల్ల జరుగుతున్న లాభనష్టాలు, రద్దు చేస్తే కలిగే పరిణామాలు , ఇతర రాష్ట్రాల్లోని పరిస్థితులను పొందుపరచనున్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు వేగంగా తీసుకుంటున్నా చట్టపరంగా, రాజ్యాంగపరంగా ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని తెలుస్తోంది. దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ అనేది 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశవ్యాప్తంగా ఒకే తీరుగా అమలులోకి వచ్చింది.రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం, రాష్ట్రాలు తమ ఇష్టానుసారం మూడు అంచెల వ్యవస్థలో మార్పులు చేయడం సాధ్యం కాదు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా రాజ్యాంగ సవరణ తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నివేదిక ఆధారంగా, ఈ ప్రతిపాదన చట్టపరంగా, రాజకీయంగా ఎంత వరకు సాధ్యమవుతుందనే దానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. కేవలం రాష్ట్ర స్థాయిలో ఒక తీర్మానం చేయడం ద్వారా లేదా ఆర్డినెన్ తీసుకురావడం ద్వారా ఈ వ్యవస్థను రద్దు చేయడం కుదరదని ఒక వేళ కేంద్రం సహకరించకపోతే ఇది న్యాయపరమైన చిక్కులకు దారి తీస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు ఈ వ్యవస్థలో సర్పంచులకు గ్రామంలో నిధులు, విధులు ఉంటాయి. కానీ ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు ప్రత్యేకంగా నిధులు గానీ, కార్యాలయాల్లో కనీసం కూర్చునేందుకు సీటు గానీ ఉండటం లేదనే అసంతృప్తి ఉంది. ఒకే గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ మధ్య తరచూ ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. అధికారాల విభజనలో స్పష్టత లేకపోవడం అభివృద్ధికి ఆటంకంగా మారుతోందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఓటు హక్కు ఉంది, కానీ సర్పంచులకు లేదు. వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఈ అసమానతలను తొలగించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.అయితే.. ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థలు 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా ఏర్పడ్డాయి. వీటిని రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టసవరణ చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం విన్నపం మాత్రమే చేయగలదు. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులను రద్దు చేస్తే, పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి జ్వాలలు ఎగిసే అవకాశం ఉంది. రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం ఉన్న ఈ మెట్లను తొలగిస్తే రాజకీయ నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది. ఇప్పుడు అదే పార్టీ అధికారంలో ఉండి ఆ వ్యవస్థలోని భాగాలను రద్దు చేస్తే దేశవ్యాప్తంగా తప్పుడు సంకేతాలు వెళ్తాయనే వాదన కూడా పార్టీలో వినిపిస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా జెడ్పీటీసీగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి నేడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. కాబట్టి ఆయన ఈ వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తిస్తారా లేదా పాలనా సౌలభ్యం కోసం రద్దు వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. ఫిబ్రవరి 23న జరగబోయే కేబినెట్ భేటీలో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ ప్రభుత్వం ఈ నిర్ణయానికే కట్టుబడితే, ఇది తెలంగాణ రాజకీయాల్లో ఒక పెను మార్పుగా నిలుస్తుంది

# జీవన రెడ్డి దారెటు?

**కరీంనగర్ :** జగిత్యాల కాంగ్రెస్‌లో సీనియర్ నేత టి.జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరు ఇప్పుడు కేవలం నియోజకవర్గానికే పరిమితం కావట్లేదు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక సంచలనంగా మారింది. దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండాను మోస్తూ, పార్టీ కష్టకాలంలోనూ అండగా నిలిచిన ఒక సీనియర్ నేత.. నేడు సొంత పార్టీలోనే 'మనుగడ' కోసం పోరాడాల్సి రావడం తీవ్ర చర్చకు దారితీస్తోంది.తెలంగాణ రాజకీయాల్లో 'క్లీన్ ఇమేజ్' ఉన్న అతికొద్ది మంది నేతల్లో జీవన్ రెడ్డి ఒకరు. కానీ, ప్రస్తుతం ఆయన ఎదుర్కొంటున్న పరిస్థితులు ఒక విధమైన రాజకీయ సంక్షోభాన్ని తలపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, కేడర్ గొంతుకగా నిలిచిన ఆయనకు.. తన ప్రత్యర్థిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లోకి రావడమే పెద్ద దెబ్బగా మారింది.గత ఎన్నికల్లో సంజయ్ కుమార్ చేతిలో జీవన్ రెడ్డి ఓడిపోయారు. అయితే, రాజకీయ సమీకరణాల్లో భాగంగా సంజయ్ కుమార్‌ను పార్టీలోకి చేర్చుకోవడం జీవన్ రెడ్డి వర్గానికి మింగుడు పడలేదు. అప్పటి నుండి నియోజకవర్గంలో ప్రోటోకాల్ విషయంలోనూ, అభివృద్ధి పనుల విషయంలోనూ ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం నెలకొంది. పార్టీ కోసం దశాబ్దాలుగా జెండాలు మోసిన కార్యకర్తలను కాదని, నిన్నగాక మొన్న వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తుంటే ఇక మా




ఉనికి ఎక్కడ? అనే ప్రశ్న జీవన్ రెడ్డి మద్దతుదారుల నుండి బలంగా వినిపిస్తోంది.ఇటీవల జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు ఈ విభేదాలను పతాక స్థాయికి తీసుకెళ్లాయి. పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వర్గానికి కాకుండా, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన నేతకే చైర్మన్ పీఠం అప్పగించడం అగ్నికి ఆజ్యం పోసింది. ఈ క్రమంలో జీవన్ రెడ్డి తన అనుచరులను స్వతంత్రులుగా పోటీ చేయించి గెలిపించుకోవాల్సి రావడం, ఆయన పడుతున్న ఆవేదనకు అద్దం పడుతోంది. "ఇంకెంత కాలం ఈ అవమానాలు భరించాలి? పార్టీలో నా భవిష్యత్తు ఏంటో అర్థం కావడం లేదు" అని ఆయన బహిరంగంగా వ్యాఖ్యానించడం ఆయన మనస్తాపానికి నిదర్శనం. జీవన్ రెడ్డికి జరుగుతున్న అన్యాయంపై మరో సీనియర్ నేత జగ్గారెడ్డి స్పందించారు. "కష్టకాలంలో పార్టీని వీడని వారికి న్యాయం చేయాలి" అని అధిష్టానాన్ని కోరారు.జగిత్యాల ప్రజల్లో జీవన్ రెడ్డి పట్ల అపారమైన గౌరవం ఉంది. సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉండే 'మనసున్న నేత'గా ఆయనకు పేరుంది. ఇప్పుడు ఆయన రాజకీయ మనుగడే ప్రశ్నార్థకం కావడం పట్ల స్థానికంగా తీవ్ర సానుభూతి వ్యక్తమవుతోంది. ఒకవేళ జీవన్ రెడ్డి గనుక పార్టీని వీడితే, జగిత్యాలలో కాంగ్రెస్‌కు ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకు భారీగా దెబ్బతినే ప్రమాదం ఉంది.ఒకవైపు అధికారంలో ఉన్న పార్టీకి ఎమ్మెల్యేల మద్దతు అవసరమే అయినప్పటికీ, దశాబ్దాల చరిత్ర ఉన్న సీనియర్ నేతలను దూరం చేసుకోవడం పార్టీ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేత పార్టీ వీడడం అంటే అది కేవలం ఒక నాయకుడిని కోల్పోవడం కాదు, నమ్మకమైన కేడర్‌ను కోల్పోవడమే. వచ్చే ఎన్నికల నాటికి ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, జీవన్ రెడ్డి ప్రత్యామ్నాయ దారి వెతుక్కోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం కలుగజేసుకుని, ఈ సీనియర్ వర్సెస్ వలస నేతల గొడవకు స్వస్తి పలకకపోతే జగిత్యాల కోటలో హస్తం పార్టీకి పతనం తప్పకపోవచ్చు.

## పైరవీలు పని చేయవు

-మొదటిపేజీ తరువాయి

చెప్పి అందరినీ ఒప్పించాను. అందరం కృషి చేయడంతో పార్టీ ఓటింగ్ 2.5 శాతం నుంచి 40 శాతానికి చేరింది. డీసీసీ అధ్యక్షులుగా బాగా పని చేసిన వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చాం. పార్టీ కోసం కృషి చేసిన మరో 60 మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చాం. ఎమ్మెల్యే టికెట్లు పొందలేని వారికి ఎమ్మెల్సీలు ఇచ్చాం. పార్టీలో అందరి పని తీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్న వారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుంది.

**గాంధీ కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించింది**

మోతీలాల్ నెహ్రూ రూ.వేల కోట్ల ఆస్తులను దేశం కోసం త్యాగం చేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన కొన్నాళ్లకే గాంధీజీని కోల్పోయామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని సీఎం గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారని రేవంత్ వివరించారు. డీసీసీ పదవి చాలా విలువైనదని, వచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోవద్దని కోరారు. డీసీసీ నుంచి పీసీసీ, ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం కావొచ్చన్నారు. ఏఐసీసీ ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ జిల్లా అధ్యక్షులకు (డీసీసీ) శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. మార్చి 2 వరకు డీసీసీ శిక్షణా తరగతులు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు ఖర్గే, కేసీ వేణుగోపాల్?లు హాజరు కానున్నారు. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ఇక అక్రమాలకు చెక్

-మొదటిపేజీ తరువాయి

చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశాలు జారీ చేశారు.

**సరైన రక్షణ వ్యవస్థలు లేవు**

పోర్టల్‌ను మరింత బలోపేతం చేసేలా సాఫ్ట్‌వేర్ రంగంలో పరిశోధన-అభివృద్ధి-ఆర్అండ్‌డీలో పట్టున్న కేంద్రప్రభుత్వ సంస్థ సి-డాక్‌కి బాధ్యతలు బాధ్యతలు అప్పగించారు. సాఫ్ట్‌వేర్ సమస్యలు, పరిష్కారాలు, డేటా భద్రతపై ఆ సంస్థ సేవలను రెవెన్యూశాఖ తీసుకోనుంది. ధరణి సాఫ్ట్‌వేర్ రూపొందించిన ప్రైవేట్ సంస్థ గతంలో రక్షణ చర్యలపై దృష్టిసారించలేదని కోడ్ ఆడిటింగ్ లాంటి వ్యవస్థలను ఏర్పాటు చేసుకోలేదని గుర్తించారు. రహస్యంగా లాగిన్లను తెరిచి ప్రభుత్వ భూములను కొల్లగొట్టడం వంటి అక్రమాలకు ఇదొక కారణమని రెవెన్యూ శాఖ అభిప్రాయపడుతోంది. 2020 సంవత్సరం అక్టోబరు నుంచి ధరణి అమల్లోకి రాగా అప్పటి నుంచే సరైన రక్షణ వ్యవస్థలు లేవని, 2024 సంవత్సరం చివరలో టెర్రా ఐసిస్ నుంచి ఎన్?ఐసీకి భూముల డేటా బదిలీ చేసిన సమయంలో గుర్తించలేకపోయిందని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

**లోపాలు వెలుగు చూసినప్పుడు కమిటీలు**

దాదాపు 75 లక్షల మందికిపైగా రైతులు సుమారు 1.60 కోట్ల ఎకరాల భూములు, లక్షల ఎకరాల ప్రభుత్వ భూముల డేటా నిర్వహణ ఈ పోర్టల్ ద్వారా జరుగుతోంది. రోజుకు సగటున 40 వేల లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో డేటాలో ఏవైనా లోపాలు సమస్యలు వస్తే వాటిని సమీక్షించేందుకు ప్రభుత్వ పరంగా ఒక నిపుణుల వ్యవస్థ లేదు. డేటా నిర్వహణ చేపడుతుండగా సాంకేతికతపై లోతైన అవగాహన, సమీక్షించే నేర్పున్న నిపుణుల అవసరాన్ని ఇటీవల జనగామ ఘటన నొక్కిచెప్పింది. లోపాలు వెలుగు చూసినప్పుడు కమిటీలు వేసి తేల్చడం కన్నా ఏ వ్యవస్థలు అవసరమో గుర్తించి అప్రమత్తం చేసేలా ఒక వింగ్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## ఇకపై పొడిగా, రుచికరంగా భోజనం

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం, పాఠశాలల్లో స్టీమ్ రైస్‌ను సరఫరా చేసేందుకు సిద్ధమవుతోంది. వివరాల్లోకి వెళితే, ఇక్కడ కనిపిస్తున్నది సూర్యాపేట జిల్లా తుంగతుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్? విద్యార్థులు. ఈ పాఠశాలలో వంట వాళ్లు శ్రద్ధ పెట్టి వంట చేసినా అది కొత్త బియ్యం కావడం వల్ల అన్నం ముద్దగా మారుతోంది. దీంతో విద్యార్థులు తినేందుకు శ్రద్ధ చూపడం లేదు. రాష్ట్రంలో అనేక చోట్ల ఇదే రకమైన పరిస్థితి ఉంది.

**తేమ శాతం ఎక్కువగా ఉండటంతో**

ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనంలో పిల్లలు అనేక రకాల సమస్యలను చెబుతూ ఉంటారు. వాటిలో ప్రధానమైనది అన్నం ముద్దగా మారడం. ఇలా అవ్వడంతో అన్నం గొంతులోకి దిగేందుకే కష్టంగా ఉంటుందని విద్యార్థులు వాపోతున్నారు. నిజానికి విద్యార్థుల భోజనానికి వండేది సన్నబియ్యమే అయినప్పటికీ, అది కొత్త బియ్యం కావడంతో ఇలా ముద్దగా తయారవుతోంది. నిజానికి కొత్త బియ్యంలో తేమ శాతం కాస్త ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగానే పాతబియ్యంతో పోల్చితే కొత్త బియ్యంతో వండిన అన్నం ముద్దగా తయారవుతుంది.

**స్టీమ్‌బియ్యం సరఫరా**

ఈ సమస్య వల్ల పిల్లలు ఇష్టపూర్వకంగా తినలేకపోతున్నారు. ఈ సమస్యను గమనించిన పౌర సరఫరాల శాఖ రాష్ట్రవ్యాప్తంగా స్టీమ్? బియ్యాన్ని సరఫరా చేయాలని నిర్ణయించింది. దీనిని మార్చి 1 నుంచి అమలు చేసేందుకు నిశ్చయించింది. ఈ మేరకు తాజాగా అన్ని జిల్లాల అధికారులకు సర్క్యులర్ విడుదల చేసింది. స్టీమ్?రైస్? వంట రుచికరంగా, గొంతులో దిగేలా పొడిపొడిగా, మృదువుగా ఉంటుందని అధికారులు అంటున్నారు.

**అన్ని ప్రభుత్వ పాఠశాలలకూ**

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారుగా 25 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వారందరికీ మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. అదనంగా సంక్షేమ వసతి గృహాలలో ఉంటూ చదువుకునే 10 లక్షల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. హాస్టళ్ల విద్యార్థులకూ అవసరమైన సన్నబియ్యాన్ని పౌర సరఫరాల శాఖనే పంపిణీ చేస్తోంది. నిజానికి కొత్త బియ్యాన్ని కొన్ని నెలలు నిల్వ చేస్తే అది పాత బియ్యంగా మారుతుంది. అయితే దీనిని నెలల తరబడి నిల్వ చేసేందుకు అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని స్టీమ్ రైస్‌ను సరఫరా చేసేందుకు పౌర సరఫరాల శాఖ నిర్ణయం తీసుకుంది.

**ఆవిరితో ప్రాసెస్ చేయడం ద్వారా**

అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు అన్ని ప్రభుత్వ స్కూళ్లకు స్టీమ్ రైస్ సరఫరా చేయనుంది. సాధారణంగా వడ్లను మరాడిస్తే కొంత నూకలు వస్తాయి. గింజ విరుగుతుంది. యాసంగి సీజన్?లో వడ్లు అయితే గింజ విరగడం మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో మరాడించక ముందే ధాన్యాన్ని ఆవిరితో ప్రాసెస్? చేస్తారు. ఇలా చేయడం వల్ల స్టీమ్? రైస్? గింజ విరగదు. ఈ బియ్యాన్ని వండినా ముద్దగా అవ్వదు. ఈ అన్నం పొడిగానూ తినడానికి మృదువుగా, సులభంగా ఉంటుంది.

## ఎన్నికల్లో గెలవలేకే అక్రమంగా కేసులు: హరీష్ రావు

**సంగారెడ్డి :** మున్సిపల్ ఎన్నికల్లో గెలవలేక అక్రమంగా కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేస్తుందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి సంగారెడ్డి జైల్లో పెట్టారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఇటీవల జరిగిన మెదక్ మున్సిపల్ ఎన్నికల ఘర్షణలో అరెస్ట్ అయి కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఉన్న 13మంది దీ=ా కార్యకర్తలతో హరీష్ రావు ములాఖత్ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలవలేక అక్రమంగా కార్యకర్తలను కారాగారానికి తరలించారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ ఒక సీటు ఎక్కువే గెలిచిందని తెలిపారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్ 15వ వార్డుకు అర్ధరాత్రి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. మెదక్ డీఎస్పీ దగ్గరుండి కాంగ్రెస్ కార్యకర్తలతో డబ్బులు పంచే ప్రయత్నం చేశారని హరీశ్ రావు ఆరోపించారు. కనుక కేసులు పెట్టాల్సింది ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులపై కానీ అన్యాయాన్ని ప్రశ్నించిన దీ=ా నాయకులపై కాదన్నారు. పోలీసులు గుడ్డిగా వ్యవహరిస్తున్నారని అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఇష్టారాజ్యంగా పోలీసులు వ్యవహరిస్తే రేపు మిమ్మల్ని సైతం శిక్షించక తప్పదని హరీశ్ రావు పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. మెదక్ లో కాంగ్రెస్ గుండాలు దీ=ా కార్యకర్తలని బెదిరిస్తున్నారని మెదక్ లో గుండాల రాజ్యం నడుస్తోందా? లేక ప్రభుత్వ పాలన నడుస్తోందా అని అడిగారు. పోలీసులు కేసులు పెట్టేటప్పుడు ఒకటికి రెండు సార్లు సరి చూసుకొని కేసులు పెట్టాలని తెలిపారు. మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే బీఆర్ఎస్ పోలింగ్ ఏజెంట్ ని తిడితే కేసు ఎందుకు పెట్టలేదన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగం పుస్తకం పట్టుకొని తిరుగుతారు.

# కామారెడ్డిలో రాజకీయ సెగలు
# బీజేపీ వర్సెస్ కాంగ్రెస్



**నిజామాబాద్ :** కామారెడ్డి జిల్లా కేంద్రంలో రాజకీయ సెగలు ఒక్కసారిగా మిన్నంటాయి. భూముల కబ్జా ఆరోపణలు, ప్రత్యారోపణల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ నేతలు విసురుకున్న సవాళ్లతో పట్టణం యుద్ధవాతావరణాన్ని తలపించింది. కామారెడ్డిలో గత కొద్దిరోజులుగా సాగుతున్న భూకబ్జా ఆరోపణలు బహిరంగ చర్చకు దారితీశాయి. బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అరోరా భూములను కబ్జా చేశారని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలను సవాల్‌గా తీసుకున్న ఎమ్మెల్యే, దమ్ముంటే తన క్యాంప్ ఆఫీస్ వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన కాంగ్రెస్ శ్రేణులు చర్చకు సిద్ధమవ్వడంతో ఉద్రిక్తత మొదలైంది. ఎమ్మెల్యే సవాల్‌ను స్వీకరించి, కాంగ్రెస్ నేత, మాజీ సర్పంచ్ గిరి రెడ్డి మహేందర్ రెడ్డి తన అనుచరులతో కలిసి బీజేపీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడికి బయలుదేరారు. కాంగ్రెస్ నాయకులు నేరుగా ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు చేరుకోవడంతో అక్కడ అప్పటికే వేచి ఉన్న బీజేపీ కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణ హింసాత్మక రూపం దాల్చింది. ఆగ్రహంతో ఊగిపోయిన బీజేపీ కార్యకర్తలు మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి ప్రయాణిస్తున్న కారుపై దాడికి దిగారు. కారు అద్దాలను ధ్వంసం చేయడమే కాకుండా, ఉద్రేకంతో కారును అమాంతం బోల్తా పడేయడం × కలకలం రేపింది. ఈ అనూహ్య ఘటనతో అక్కడ ఒక్కసారిగా భీతావహ వాతావరణం నెలకొంది.

శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. చర్చకు వెళ్లకుండా ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డిని ఆయన నివాసంలోనే హౌస్ అరెస్ట్ చేశారు. ఆయన బయటకు రాకుండా భారీగా పోలీసు బలగాలను మోహరించారు. పోలీసుల తీరుపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అధికార పక్షం అండతోనే పోలీసులు తనను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఘర్షణలు జరగకుండా పట్టణంలోని పలువురు ముఖ్యమైన బీజేపీ మరియు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నుంచే నేతల ఇళ్ల వద్ద నిఘా పెంచారు. ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టడంతో పాటు, అనుమానితులను పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులతో రాజకీయ శ్రేణుల్లో తీవ్ర అసహనం వ్యక్తమైంది. చర్చా వేదికగా ప్రకటించిన శిశు మందిర్ పాఠశాల పరిసర ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అక్కడ భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి, అపరిచిత వ్యక్తులు ఎవరినీ అటువైపు వెళ్లకుండా కట్టుదిట్టం చేశారు. వందలాది మంది పోలీసుల మోహరింపుతో ఆ ప్రాంతం కర్ఫ్యూను తలపించింది. మీడియా ప్రతినిధులను కూడా పరిమితంగానే అనుమతించారు. చర్చా వేదిక నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీ ప్రదర్శనగా బీజేపీ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వైపు వెళ్లడానికి ప్రయత్నించాయి. ఈ క్రమంలో రెండు పార్టీల కార్యకర్తలు ముఖాముఖి ఎదురుపడటంతో వాగ్వాదం మొదలై, అది కాస్తా తీవ్ర స్థాయి దాడులకు దారితీసింది. పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో ఆ ప్రాంతమంతా భయాందోళనలు నెలకొన్నాయి. ఈ గందరగోళంలో కాంగ్రెస్ నాయకుడికి చెందిన కారును బీజేపీ కార్యకర్తలు లక్ష్యంగా చేసుకున్నారు. పరిస్థితి పూర్తిగా అదుపు తప్పుతుండటంతో పోలీసులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కారు బోల్తా పడిన ఘటన తర్వాత మరింత ఘర్షణ జరగకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు ఇరు వర్గాలను చెదరగొట్టి, క్యాంప్ ఆఫీస్ పరిసరాల్లో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కామారెడ్డిలో పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది. బహిరంగ చర్చ పేరుతో మొదలైన ఈ వివాదం భౌతిక దాడుల వరకు వెళ్లడం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు హౌస్ అరెస్టులు, మరోవైపు రోడ్లపై దాడులతో జిల్లా కేంద్రం స్తంభించిపోయింది. గొడవకు కారణమైన ప్రధాన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం క్యాంప్ ఆఫీస్ పరిసరాల్లో 144 సెక్షన్ తరహా ఆంక్షలు అమలు చేస్తున్నారు.

# ప్రతిభవంతుల గుర్తింపే ప్రభుత్వ లక్ష్యం




**సిద్దిపేట :** సిద్దిపేట జిల్లాలో గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించే భాగంగా క్రీడా పోటీలను నిర్వహించి, ప్రతిభా వంతులను గుర్తింపు జరిగే విధంగా చీఫ్ మినిస్టర్ కప్ 2025 రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు సిద్దిపేట జిల్లా రంగనాయక సాగర్ ప్రాజెక్టు పై జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి జంగపల్లి వెంకట నరసయ్య లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసినప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్పు పేరిట గ్రామీణ ప్రాంతాలలో ఉన్న క్రీడాకారులను గుర్తించడానికి, ప్రతిభా గల క్రీడాకారులకు ప్రోత్సాహకాలుగా అందజేస్తున్నట్లు వారు చెప్పారు.. ప్రతిభ ను గుర్తించి శిక్షణ ఇవ్వడానికి శిక్షకుల నియామకం చేపడుతున్నట్లు తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని శారీరక ఎదుగుదలకు ఉపయోగపడుతుంది అని చెప్పారు. పల్లెల నుంచి ప్రపంచ స్థాయి వరకు ఆటలనే నినాదం మేరకు ఈ పోటీలను గ్రామస్థాయి నుండి నిర్వహించి ప్రతిభావంతులు పంపుతామన్నారు..విద్యార్థులు యువకులు పెట్టే అవకాశాన్ని ఉపయోగించుకొని తన ప్రతిభను చాటి ఒలంపిక్ స్థాయిలో ఎదగాలని కోరారు. రాష్ట్రస్థాయి సైకిల్ పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి సుమారు 400 మంది విద్యార్థులు యువకులు పాల్గొన్నారు మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ క్రీడలు రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా సైకిల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాస్, కోశాధికారి చింతకింది శ్రీనివాస్, జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ సౌందర్య, ఖేలో ఇండియా కోచ్ సంజీవ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ మంగారెడ్డి, సిద్దిపేట్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, చిన్నకోడూర్ సబ్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్, చంద్లాపూర్ సర్పంచ్ శేఖర్, మాజీఎఫ్ సెక్రటరీ పాతూరి సుజాత, రామేశ్వర్ రెడ్డి, మాలతి, సువర్ణ లత, ఉప్పలయ్య, సిద్దిపేట జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కోచులు సైక్లిస్టులు తదితరులు పాల్గొన్నారు. సైక్లింగ్ టెక్నికల్ టీం గా దత్తాత్రేయ, విజయ్ కాంత్ రావు, విజయభాస్కర్, అల్లాడి కృష్ణ, ధర్మ తేజ తదితరులు పాల్గొన్నారు.

# జాతరకు ముస్తాబైన సిరిచెల్మ మల్లికార్జునాలయం

**నేటి నుంచి వారం రోజుల పాటు ఉత్సవాలు**

**తరలి రానున్న పొరుగు రాష్ట్రం భక్తులు**



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ :** సిరిచెల్మ మల్లన్నా.. నీకు వేల వేల దండాలన్నా.. అంటూ భక్తులు పారవశ్యంతో కొలిచే సిరిచెల్మ లోని మల్లికార్జున ఆలయంలో నేటి (ఆదివారం) నుంచి జాతర ప్రారంభ కానుంది. ఇందు కోసం ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. భాషలు వేరైనా భావం ఒక్కటే.. మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే.. అందరూ ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామంలో నిర్వహించే జాతరకు భక్తితో వెళ్ళడం తరతరాల నుంచి వస్తున్న సంప్రదాయం. ప్రతి సంవత్సరం శివరాత్రి పండుగ తర్వాత జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఏడు రోజుల పాటు జాతర జరుగుతుంది. ఈ జాతర సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు.. మొక్కులను తీర్చుకుంటారు. ప్రాచీన పురాతన మల్లి కార్జున ఆలయం మత సామరస్యానికి వేదికగా, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఈ ఆల యాన్ని మల్లికార్జున, సోమేశ్వర, మల్లన గుడిగా భక్తులు ఇలా పిలుస్తుంటారు. ఆలయంలో అన్ని మత వ్యవ స్థాపనకు చెందిన విగ్రహాలు కొలువుదీరి ఉన్నా యి. ప్రతి నిత్యం ఉదయం సూర్య కిరణాలు నంది విగ్రహాన్ని ముద్దాడుతూ.. గర్భగుడిలో కొలువు దీరిన శివలింగంపై ఏటవాలుగా జాలు వారడం ఈ ఆలయం ప్రత్యేకత.

**పొరుగు రాష్ట్రం నుంచి భక్తులు..**

జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా పోరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని కిన్వ ట్, నాం దేడ్, చంద్రపూర్, యావత్ మాల్, పర్భని జిల్లాల నుంచి భక్తులు వేలాది సంఖ్యలో తరలి వస్తారు. బెల్లం (బంగారం) ముద్దలతో ప్రత్యేకంగా మొక్కలను తీర్చుకుంటారు.

**ప్రత్యేకంగా ఊరేగింపు...**

జాతర సందర్భంగా ప్రతిరోజు మల్లికార్జున స్వామి శావళ్లను భాజా భజంతులతో గ్రామమంత కన్నుల పండుగగా ఊరేగిస్తారు. చివరి రోజు తెల్లవారు జామున రథచక్రాన్ని ప్రత్యేకంగా ఊరేగించి హోమ గుండం కాల్చడంతో ఈ జాతర ముగుస్తుంది. ముగింపు రోజున భక్తులు ఆలయం నడి మధ్యలో ఉన్న జలాశయంలో పుణ్య స్నానాలు ఆచరించి అగ్నిగుండంలో నడవటం ఈ జాతరకే ప్రత్యేకంగా నిలుస్తుంది.

## ఆధార్ కార్డు కాదు..
## ఇకపై ఇది ఉంటేనే మహిళలకు ఫ్రీ బస్సు..!

**హైదరాబాద్ :** మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్న మహిళల కోసం ఆర్టీసీ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. అర్హులకే ప్రయోజనం అందేలా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ కార్డులు జారీ చేయాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఫేక్ ఆధార్ కార్డులతో ప్రయాణాలు, ఇతర రాష్ట్రాల మహిళల వినియోగాన్ని అడ్డుకునేందుకే ఈ చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకానికి నగరంలో విశేష స్పందన లభిస్తోంది. ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో సుమారు 3,200 బస్సులు నడుస్తుండగా, అందులో దాదాపు 2 వేల ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. రోజుకు సుమారు 5 లక్షల మంది ప్రయాణికుల్లో దాదాపు 2 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నారు. ఆక్యుపెన్సీ రేషియో కూడా 90 శాతానికి చేరింది.అయితే, ఇటీవల ఫేక్ ఆధార్ కార్డులతో ప్రయాణాలు జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. సుమారు 25 నుంచి 30 వేల వరకు అనుమానాస్పద ప్రయాణాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం పెరుగుతున్న నేపథ్యంలో స్మార్ట్ కార్డు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. స్మార్ట్ కార్డులను చిప్ ఆధారిత టెక్నాలజీతో రూపొందించనున్నారు. కార్డులో లబ్ధిదారుల పేరు, చిరునామా, ప్రత్యేక ఐడీ నంబర్ వంటి వివరాలు నమోదు చేస్తారు. ప్రస్తుతం ఆధార్ కార్డు చూపిస్తే టికెట్ జారీ చేస్తున్న కండక్టర్లు, కొత్త విధానంలో స్మార్ట్ కార్డును టికెట్ ఇష్యూయింగ్ మెషీన్‌తో స్వైప్ చేస్తారు. వెంటనే టికెట్ జనరేట్ అవుతుంది. దీంతో ప్రయాణ ధృవీకరణ మరింత పారదర్శకంగా ఉంటుంది. ఆధార్ కార్డులను ప్రతిసారి వెంట తీసుకెళ్లాల్సిన ఇబ్బంది తగ్గడంతో పాటు, అర్హులైన మహిళలకు సౌకర్యవంతమైన విధానం అమల్లోకి రానుంది. స్మార్ట్ కార్డు జారీ విధానం, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై త్వరలో స్పష్టత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేసేందుకు ఈ చర్యలు కీలకంగా మారనున్నాయి.

## నిస్వార్థ నాయకత్వమే దేశానికి ముఖ్యం..
### నితిన్ నబీన్‌కు మహంత్ స్వామి మహారాజ్ ఆశీస్సులు

**హైదరాబాద్ :** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన తర్వాత తిన్ నబిన్ తొలిసారిగా గుజరాత్ రాష్ట్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గాంధీనగర్‌లోని సుప్రసిద్ధ పూజ్య స్వామినారాయణ్ అక్షరధామ్ క్షేత్రాన్ని సందర్శించి, పవిత్ర మహంత్ స్వామి మహారాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బాధ్యతలు చేపట్టిన అనంతరం రాష్ట్రానికి విచ్చేసిన ఆయనకు ఘనస్వాగతం లభించింది. అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ భేటీలో నితిన్ నబిన్ మహంత్ స్వామి మహారాజ్ నుండి ఆశీర్వాదాలు తీసుకున్నారు. దేశంలో నిరంతర శాంతి, ఐక్యత, సామరస్యం, శ్రేయస్సు వెల్లివిరియాలని స్వామీజీ ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నైతిక విలువలతో కూడిన నాయకత్వం దేశాభివృద్ధికి ఎంతో అవసరమని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో నితిన్ నబిన్ వెంట పలువురు బిజెపి అగ్రనేతలు ఉన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్, జగదీష్ విశ్వకర్మ, రత్నాకర్జీ సహా పలువురు నేతలు ఆయన వెంట ఉన్నారు. మహంత్ స్వామి మహారాజ్ తన సందేశంలో.. కరుణ, నిస్వార్థ నాయకత్వం, సమగ్రత వంటి విలువలను ప్రతి నాయకుడు అలవర్చుకోవాలని సూచించారు. సమాజ సమగ్ర అభివృద్ధికి, సాంస్కృతిక విలువల పరిరక్షణకు ఉమ్మడి నిబద్ధత అవసరమని ఈ సమావేశం చాటిచెప్పింది. అక్షరధామ్ యొక్క ప్రశాంత వాతావరణంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక సంభాషణ ప్రజా జీవితంలో నైతిక విలువల ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేసింది.

## ఫ్రీగా టమాటా

**వరంగల్ :** టమాటా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అమ్మకానికి మార్కెట్‌కు తరలించిన టమాటా కోనే నాథుడు కరువయ్యాడు. కనీస గిట్టుబాటు ధర లేదు.. చేతికి అందిన పంట కుళ్లిపోతుండటంతో కొందరు రైతులు కడుపుమండి వినూత్న నిరసన తెలిపారు. వినియోదారులకు టమాటాలు ఉచిత సరఫరా చేసి ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లాలోని వారాంతపు సంతలో ఈ విచిత్ర సంఘటన జరిగింది. ఒక ట్రాలీ లోడ్ టమాటలు రైతులు ఉచితంగా సరఫరా చేశారు. ఆ టమాటాల కోసం జనం ఇగబడి సంచులు, బట్టలతో ఎగబడ్డారు. సాధారణ సమయంలో టమాటా ధరలు సెంచరీ కొట్టిన సందర్భం కూడా ఉంది. కానీ ఇప్పుడు టమాటా ధరలు నేల చూపులు చూస్తున్నాయి. రైతులు కనీసం కిలో 2 రూపాయల ధర పలకని టమాటా ధర చూసి బిత్తర పోతున్నారు. చేతికి అందిన ఆ పంటను ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఒకటికాదు రెండు కాదు ఏకంగా 1200 కిలో ఒక ట్రాలీ లోడ్ టమాటాలు ఉచితంగా పంపిణీ చేశారుఈ ఉచిత పంపిణీ సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో జరిగింది. వారాంతపు సంత సందర్భంగా గూడూరు మండలం భూపతిపేట గ్రామానికి చెందిన సారయ్య, మోహన్, సురేందర్ అనే రైతులు టమాట పంటను అమ్మకానికి తీసుకువచ్చారు. అయితే ఆశించిన స్థాయిలో గిరాకీ లేకపోవడంతో పాటు ధరలు అమాంతం పడిపోయాయి. దీంతో తీవ్ర నిరాశ చెందిన రైతులు ఆ టమాటా ఇంటికి తీసుకెళ్లలేక అక్కడే ఉచితంగా పంపిణీ చేశారు. అప్పులు చేసి కష్టపడి పంట వేస్తే ధరలు దారుణంగా పడిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అయిజలో అగ్నిప్రమాదం.. భారీగా ఆస్తి నష్టం

**జోగులాంబ గద్వాల :** జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజలో అగ్నిప్రమాదం జరిగింది. అయిజలోని ఓ ప్రైవేటు కంపెనీలో భారీగా మంటలు చెలరేగాయి. మంటలు భారీగా ఎగసిపడుతుండటంతో స్థానికులు భయంతో వణికిపోయారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రమాదానికి షార్ట్‌సర్క్యూటే కారణమని అగ్నిమాపక సిబ్బంది వెల్లడించారు. భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం. ప్రాణ నష్టం గురించి ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు
## హైదరాబాద్ సిటీ పోలీసులు సరికొత్త వ్యూహం

**క్రియేటర్లు సామాజిక బాధ్యతగా ముందుకు రావాలి**

**జాగృత్ హైదరాబాద్ – సురక్షిత్ హైదరాబాద్’ క్యాంపెయిన్‌లో నగర సిపి సజ్జనార్ పిలుపు**

**హైదరాబాద్ :** సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. కేవలం అధికారిక హెచ్చరికలకే పరిమితం కాకుండా, సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యే రీతిలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్, ఐపిఎస్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్న ‘జాగృత్ హైదరాబాద్ – సురక్షిత్ హైదరాబాద్’ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ నూతన విధానానికి విశేష స్పందన లభిస్తోంది. పోలీసుల పిలుపు మేరకు పలువురు ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సైబర్ నేరాల తీరుతెన్నులను వివరిస్తూ తమదైన శైలిలో వీడియోలు రూపొందిస్తున్నారు. వీటిని హైదరాబాద్ సిటీ పోలీస్, సిపి విసి సజ్జనార్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలతో ‘కొలాబరేట్’ చేయడం ద్వారా లక్షలాది మందికి చేరువ చేస్తున్నారు. వినోదాత్మకంగా ఉంటూనే, అత్యంత కీలకమైన సైబర్ భద్రతా సూచనలను ఈ వీడియోలు ప్రజలకు అందిస్తున్నాయి.

## ట్రాఫిక్ నిబంధన పట్ల ప్రజల్లో చైతన్యం రావాలి:

**సిద్దిపేట :** ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి అరైవ్ అలైవ్ కార్యక్రమం లో భాగంగా చేసిన సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఒక సరికొత్త శ్రీకారానికి పలువురు కంటెంట్ క్రియేటర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ట్రాఫిక్ నిబంధనలపై ఆసక్తికరమైన వీడియోలు రూపొందించారు. దీనికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్రభావాన్ని గుర్తించి, స్థానిక సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు మరియు కంటెంట్ క్రియేటర్స్ సైబర్ నేరాలు, మహిళలపై వేధింపులు, మరియు ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించే విధముగా , ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించేలా చిన్న చిన్న వీడియోలు సోషల్ మీడియాలో వీడియోలు రూపొందించాలని సూచించారు. సమాజ శ్రేయస్సు కోరి మరిన్ని డిజిటల్ క్రియేటర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ కోరారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com